


కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే సోనియాగాంధీ ఓ జాతీయమీడియా సంస్థకు రాసిన కథనంలో ఆందోళన వ్యక్తంచేశారు.

ఆ కథనంలోని కొన్ని లైన్స్‌ను కాంగ్రెస్ షేర్ చేసింది. "గుజరాత్, రాజస్థాన్, హరియాణాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలది దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా.. మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది మైనర్లు, మాఫియాకు బహిరంగ ఆహ్వానం. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని (1972) ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి" అని సోనియా డిమాండ్ చేశారు.

**'సర్' నిర్వహణకు ఈసీ కారణాలు సాకులే...** కేంద్రం తీసుకువచ్చిన మార్పులను అంగీకరించిన సుప్రీంకోర్టు.. అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలపై చేసిన సిఫారసుల్ని పరిశీలించేందుకు ఓకే చెప్పింది. సుస్థిర మైనింగ్ కోసం నిర్వహణ ప్లాన్‌ను సిద్ధం చేయాలని పర్యావరణ మంత్రిత్వశాఖను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్లాన్ ఖరారయ్యే వరకు మైనింగ్ కోసం కొత్తగా లీజులు ఇవ్వకూడదని ఆదేశాల్లో పేర్కొంది. కాగా.. ప్రపంచంలోనే పురాతనమైన పర్వతశ్రేణుల్లో ఆరావళి ఒకటి. వాటిలో మితిమీరిన మానవ కార్యకలాపాలు, వనరుల దోపిడీ కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దానివల్ల పలు రాష్ట్రాలతో పాటు రాజధాని దిల్లీ ప్రాంతం సైతం భవిష్యత్తులో తీవ్ర వాతావరణ దుష్పరిణామాలతో తల్లడిల్లే ప్రమాదం పొంచి ఉందని ఎప్పటినుంచో ఆందోళనలు వినిపిస్తున్నాయి.




పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి అలీమా ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో యుద్ధం కోసం పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. అయితే, తన సోదరుడు మాత్రం పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నాలు చేశారన్నారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అలీమా ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను ఇస్లామిక్ ఛాందసవాదిగా అభివర్ణించారు. ఇమ్రాన్ స్వేచ్ఛావాది అని అన్నారు. ఈ సందర్భంగా మేలో భారత్– పాక్ మధ్య యుద్ధానికి గల కారణం గురించి ప్రశ్న ఎదురవగా.. ఆమె మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఆసిమ్ మునీర్ ఇస్లామిక్ ఛాందసవాది. అందుకే అతడు భారత్‌తో యుద్ధం కోసం ఆరాటపడుతున్నాడు. ఇమ్రాన్‌ఖాన్ పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాలకు ప్రయత్నాలు చేశారు. సందర్భం వచ్చినప్పుడల్లా మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడు. ఇది భారత్‌తో పాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమే' అని అన్నారు.

**ఏకాంత కారాగారవాసంలో ఇమ్రాన్‌ఖాన్...** మాజీ ప్రధాని జైల్లోనే మృతి చెందారంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆయన మరో సోదరి ఉజ్మా ఖానుమ్ ఇమ్రాన్‌ను మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇమ్రాన్ జైల్లో సురక్షితంగానే ఉన్నారని, అయితే మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను జైలు శిక్ష అనుభవించడానికి ఆసిమ్ మునీర్ కారణమని ఇమ్రాన్ తనతో చెప్పాడని ఉజ్మా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పాక్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. పాక్ ప్రజలను అణచివేసేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇందులో ఒక నేపాలీతో సహా 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఈ క్రమంలో కొన్ని రోజుల పాటు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగాయి. అనంతరం ఇరుదేశాలు కాల్పుల విరమణను ప్రకటించాయి.




## అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసు.. సమాచారం ఇస్తే 50వేల డాలర్లు: ఎఫ్‌బీఐ

అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా 2017లో తన కుమారుడితో సహా దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఓ కీలక ప్రకటన చేసింది. నిందితుడు హమీద్ ఆచూకీ తెలిపిన వారికి 50వేల డాలర్ల రివార్డు ఇస్తామని పేర్కొంది. ఈ కేసులో నజీర్ హమీద్‌ను నిందితుడిగా అధికారులు తేల్చారు. హత్యలు జరిగిన ఆరు నెలల అనంతరం నిందితుడు భారత్‌కు పరారైనట్లు అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతడు అక్కడే ఉన్నాడని తెలిపారు. హమీద్ అరెస్టుకు సంబంధించి వారెంట్‌ను జారీ చేసినట్లు ఎఫ్‌బీఐ (%ఖీదీ×%) తెలిపింది. దీంతోపాటు అతడి సమాచారం అందించిన వారికి 50వేల డాలర్లు రివార్డు అందిస్తామని ప్రకటించింది. ఈ హత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు వివరించారు. ఇక, హత్య కేసుపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో బాధితురాలి భర్త హనుమంతరావు కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు బర్లింగ్టన్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

**హమీద్ అప్పగింతపై చర్చలు..** ఇక, భారత్‌లో ఉన్న హమీద్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు అమెరికా అధికారులు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా ఇటీవల న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ యూఎస్‌లోని భారత రాయబారి వినయ్ క్వాత్రాకు లేఖ రాశారు. హమీద్ అప్పగింతకు సంబంధించి భారత ప్రభుత్వం సహాయం కోరారు. దారుణమైన హత్య రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక ఒప్పందానికి అనుగుణంగా హమీద్ అప్పగింతకు సహకరించాలన్నారు. అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నర్రా హనుమంతరావు, భార్య శశికళ(40), కొడుకు అనీష్ సాయి(7)తో కలిసి న్యూజెర్సీలో నివసించేవాడు. 2017 మార్చిలో హనుమంతరావు విధులు ముగించుకొని వచ్చేసరికి.. వారి అపార్ట్‌మెంట్‌లో భార్య, కొడుకు రక్తపు మడుగులో ఉండటాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యలకు పాల్పడింది భర్త నర్రా హనుమంతరావేనని మృతురాలి బంధువులు ఆరోపించారు. అతడికి ఓ కేరళ మహిళతో వివాహేతర సంబంధం ఉందని పేర్కొన్నారు.

ఈ క్రమంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, డీఎన్‌ఏ పరీక్షల్లో అతడి ప్రమేయం లేదని తేలడంతో వదిలిపెట్టారు. కాగా.. సహోద్యోగి అయిన హమీద్‌తో హనుమంతరావుకు భేదాభిప్రాయాలు ఉన్నట్లు అధికారులు విచారణలో గుర్తించారు. హత్య కేసులో అతడి కోణంపై దర్యాప్తు చేస్తుండగా.. అతడు భారత్‌కు పారిపోయినట్లు గుర్తించారు. హమీద్ ల్యాప్‌టాప్ నుంచి సేకరించిన డీఎన్‌ఏ హత్య జరిగిన ప్రాంతంలోని డీఎన్‌ఏతో సరిపోలడంతో.. అతడే నిందితుడని ఇటీవల అమెరికా పోలీసులు ప్రకటించారు. అతడిని పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

## కారు డ్రైవరే కాలయముడైన వేళ... ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య!

ఎవరిని నమ్మాలి, మరెవరిని నమ్మకూడదు..? ఇంట్లో డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి సైతం అపనమ్మకస్తుడిగా మారి, ఆ ఇంటి బిడ్డనే అపహరించి హత్య చేసిన ఘటన తాజాగా తీవ్ర కలకలం రేపింది. దేశ రాజధాని ఢిల్లీలోని నరేలాలో జరిగిన ఈ విషాద సంఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అవును... తన ఇంటి బయట ఆడుకుంటూ కనిపించిన ఐదేళ్ల బాలుడు, కాసేపటి తర్వాత అదృశ్యమయ్యాడు. అయితే.. కొన్ని గంటల తర్వాత అతని మృతదేహం.. అతని తండ్రి కారు డ్రైవర్ గదిలో కనిపించింది. ప్రతీకార హత్యగా భావించి హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని నీతూగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేలాలోని తన ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమయ్యాడు. దీంతో... మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో నరేలా పారిశ్రామిక ప్రాంతంలో అనుమానిత కిడ్నాప్ కు సంబంధించిన



కాల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఆ సమయంలో అసలు విషయం వెలుగు చూసింది! ఇందులో భాగంగా... అదే ప్రాంతంలో నివసించే నీతు అనే డ్రైవర్ అద్దెకు తీసుకున్న గదిలో ఆ పిల్లవాడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీతో... ఆ బాలుడిని వెంటనె సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అతడు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో పిల్లవాడిని ఇటుకలు, కత్తితో కొట్టి చంపినట్లు తేలిందని అన్నారు.

**హత్యకు ఇదేనా కారణం?:** ఈ సందర్భంగా స్పందించిన ఓ పోలీసు అధికారి... సోమవారం తాగిన మత్తులో మరొక డ్రైవర్ తో అసభ్యంగా ప్రవర్తించినందుకు నీతుని అతని యజమాని మందలించి, చెంపదెబ్బ కొట్టాడని చెబుతున్నారు. దీంతో యజమానిపై ఆగ్రహంగా ఉన్న నీతూ.. ఆ బాలుడిని తన ఇంటి బయట నుంచి కిడ్నాప్ చేసి తన గదికి తీసుకెళ్లి, అక్కడ హత్య చేసినట్లు తెలుస్తోందని.. ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు! ఈ నేపథ్యంలో... నరేలా పోలీస్ స్టేషన్ లో హత్య, కిడ్నాప్ సహా భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మూడు గంటల్లోనే న్యూయార్క్ టు లండన్... ఏమిటీ విమానం ప్రత్యేకత!

ఫ్రీహెూల్డ్ – ఫ్లైకాన్ కార్డ్ లిమిటెడ్ అనే కంపెనీ కాంకోర్డ్ విమానం పని చేయడం ఆగి, పదవీ విరమణ చేసిన సుమారు 20 సంవత్సరాల తర్వాత సూపర్ సోనిక్ ప్యాసింజర్ విమానాలను తిరిగి తీసుకురావాలని యోచిస్తోంది. అన్నీ అనుకూలంగా జరిగితే.. ఈ కొత్త విమానం 2026 నాటికి సేవలను ప్రారంభించవచ్చని చెబుతున్నారు. దీంతో... ఈ విషయం ఏవియేషన్ రంగంలో సరికొత్త చర్చనీయాంశంగా మారింది. అవును.. సుమారు 27 సంవత్సరాల సేవల తర్వాత కాంకోర్డ్ విమానం 2003లో ఎగరడం ఆగిపోయింది. దీనికి పలు రకాల కారణాలు ఉన్నాయి. ఇందులో భాగంగా.. అధిక నిర్వహణ ఖర్చులు, పరిమిత మార్గాలతో పాటు 2000వ సంవత్సరంలో జరిగిన ఘోర ప్రమాదం వెరసి దాని విరమణకు దారితీశాయి. అయితే.. ఇప్పుడు కొత్త సాంకేతికత, మారిన నిబంధనలు మరొక ప్రయత్నాన్ని సాధ్యం చేస్తున్నాయని అంటున్నారు.

**కాంకోర్డ్ తిరిగి వస్తుందా?:** జూన్ 2025లో యునైటెడ్ స్టేట్స్ లో అతిపెద్ద మార్పు జరిగింది. ఇందులో భాగంగా... భూమిపై సూపర్



సోనిక్ విమానాలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ కాంగ్రెస్ ఒక చట్టాన్ని ఆమోదించింది. వాస్తవానికి ఈ నిషేధం కాంకోర్డ్ ఎగరగలిగే ప్రదేశాలను తీవ్రంగా పరిమితం చేసింది. అయితే.. తాజా మార్పుతో ఈ పరిమితి లేకుండా.. సూపర్ సోనిక్ విమానాలు మరిన్ని మార్గాలను లాభదాయకంగా నడపగలవు. ఇందులో భాగంగా... లండన్ నుండి న్యూయార్క్ వరకు స్పష్టమైన ఎంపిక ఉండగా... ఇప్పుడు దేశీయ యూఎస్ మార్గాలు సాధ్యమవుతున్నాయి. ఈ క్రమంలో... లాస్ ఏంజిల్స్ నుండి వాషింగ్టన్ వరకు ఇవి పనిచేయగలవు.. ఇదే సమయంలో.. యూరప్ లేదా ఆసియా అంతటా ఖండాంతర మార్గాలు కూడా పనిచేయగలవు. తొలి కాంకోర్డ్ యుగం నుండి సాంకేతికత కూడా గణనీయంగా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో... కొత్త డిజైన్ పాత డిజైన్ కంటే 50 శాతం తక్కువ బరువు కలిగి ఉందని నివేదించబడింది. ఈ కొత్త విమానం డిజైన్ 60,000 అడుగుల ఎత్తులో ప్రయాణించడానికి వీలు కల్పిస్తుంది. ఇది అసలు కాంకోర్డ్ సాధారణ క్రూజింగ్ ఎత్తు కంటే చాలా ఎక్కువ. ముఖ్యంగా.. ఈ కొత్త డిజైన్ చాలా తక్కువ సోనిక్ బూమ్ ను ఉత్పత్తి చేస్తుందని ఇంజనీర్లు పేర్కొన్నారు. అసలు కాంకోర్డ్ బిగ్గరగా ఉన్న సోనిక్ బూమ్ ఒక పెద్ద సమస్య కాగా.. ఇది విమానం ప్రజా ఇమేజ్ ను దెబ్బతీసిందని చెబుతారు.

**తగ్గనున్న విమాన ప్రయాణ సమయం!:** సూపర్ సోనిక్ ప్రయాణం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇందులో భాగంగా.. లండన్ నుండి న్యూయార్క్ కు ప్రస్తుతం నేటి వాణిజ్య విమానంలో సుమారు 7 గంటల సమయం పడుతుండగా... కొత్త సూపర్ సోనిక్ విమానం 3 గంటలకు తగ్గించవచ్చని చెబుతున్నారు. ఇదే సమయంలో.. లాస్ ఏంజిల్స్ నుండి వాషింగ్టన్ కు 5–6 గంటల నుండి సుమారు 2 గంటలకు తగ్గుతుంది!

## గంటన్నరలో హైదరాబాద్ - గుంటూరు.. ఇదే ఆ మెగా ప్రాజెక్టు!



కాలం మారుతున్న కొద్దీ జీవనశైలిలో వేగం అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. అందుకు నిదర్శనంగా పలు ప్రాజెక్టులు తెర మీదకు వస్తున్నాయి. తాజాగా అలాంటి సరికొత్త ప్రాజెక్టు ఒకటి తెర మీదకు వచ్చింది. గంటకు 350 కి.మీ. వేగంతో పరుగులు తీసే ఎలివేటెడ్ రైలు కారిడార్ కు సంబంధించిన ఒక కొత్త ప్రతిపాదన ఆసక్తికరంగా మారింది. దక్షిణ మధ్య రైల్వే సిద్ధం చేసిన ఈ ప్రతిపాదన ఇప్పుడు అందరిని ఆకర్షిస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. భవిష్యత్తులో హైదరాబాద్ నుంచి గుంటూరుకు చేరుకోవటానికి గరిష్ఠంగా గంటన్నర.. కనిష్ఠంగా గంట కంటే తక్కువ వ్యవధిలోనే చేరుకునే పరిస్థితి. హైదరాబాద్ నుంచి గుంటూరుకు నడికూడి రైలు మార్గం 300కి.మీ. కంటే తక్కువగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి ఏపీ మీదుగా రెండు ముఖ్య రాష్ట్ర రాజధాని నగరాలను కలిపేలా రెండు ఎలివేటెడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేయాలన్నది దక్షిణ మధ్య రైల్వే ఆలోచన. ఇందులో భాగంగా హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై నగరాలకు ఎలివేటెడ్ రైలు కారిడార్ లు నిర్మించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ కారిడార్ల మధ్య నడిచే రైళ్లు గంటకు 350కి.మీ. వేగంతో పరుగులు తీస్తాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై నగరాల మధ్య ప్రయాణ వ్యవధి భారీగా తగ్గిపోనుంది. హైదరాబాద్ – బెంగళూరు కారిడార్ 605కి.మీ. కాగా హైదరాబాద్ – చెన్నై కారిడార్ 760కి.మీ. అంటే.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రెండు గంటల కంటే తక్కువ వ్యవధిలో చేరుకునే వీలుంది. ఇక.. చెన్నైకు మాత్రం రెండున్నర గంటల కంటే తక్కువ వ్యవధిలోనే చేరుకునే వీలుంది. ఈ కారిడార్ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. విమాన ప్రయాణం కంటే తక్కువ సమయంలోనే గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే.. డొమెస్టిక్ ప్రయాణాలకు తక్కువ వేసుకున్నా.. రెండు గంటల ముందే ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సి ఉంటుంది. గంట నుంచి గంటన్నర పాటు ఎయిర్ పోర్టుకు చేరుకునేందుకు సమయం తీసుకోవటంతో పాటు.. అక్కడి ఎయిర్ పోర్టు నుంచి సిటీకి చేరుకోవటానికి మరో గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. ఈ లెక్క మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటే విమానం కంటే వేగంగా చేరుకునే వీలుంది. అయితే.. ఈ రైల్వే కారిడార్ ఏర్పాటుకు భారీగా ఖర్చు కానుంది. దక్షిణ మధ్య రైల్వే వేసిన అంచనా ప్రకారం ఈ రెండు ప్రాజెక్టులకు రూ5.42 లక్షల కోట్లు అవసరమవుతాయి. ఈ కారిడార్ కోసం ప్రత్యేకంగా రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ రెండు కారిడార్ల ఏర్పాటుతో తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ – కర్ణాటక – తమిళనాడు మధ్య ప్రయాణ వ్యవధి తగ్గిపోవటమే కాదు.. ఇదో గేమ్ ఛేంజర్ గా మారుతుందని చెప్పాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నైకు వెళ్లాలంటే తక్కువలో తక్కువ 12 గంటల సమయం పడుతోంది. అదే ఏపీ మీదుగా అంటే మరింత ఎక్కువ సమయం తీసుకునే పరిస్థితి. ఇలాంటి వేళ.. తెర మీదకు వచ్చిన ఈ మెగా ప్రాజెక్టు.. పేపర్ మీదనే పరిమితం అవుతుందా? లేదంటే పట్టాలు ఎక్కుతుందా? అన్నది కాలమే డిసైడ్ చేయాలి.

